

# అప్పిచ్చువాడ

"అప్పిచ్చువాడు...

...చొప్పడిన వూరనుండుము" అన్నాడు సుమతీ శతకకారుడు!

ఎప్పుడు ఎడతెగక పారు ఏళ్ళు అన్ని వూళ్ళల్లోనూ ఉండవు. బహుశా సుమతీ శతకకర్త పై సూక్తిని నిర్వచించిన కాలంలో అప్పిచ్చువాడు ఎప్పుడు ఎడతెగక పారు ఏరు వంటివాడై ఉంటాడు కాబోలు.

కాని నేటి సంగతి వేరు. ఉన్న ఏళ్ళన్నీ ఎక్కడికక్కడ ఎండిపోవడం, అప్పిచ్చేవాళ్ళు ఎక్కడబడితే అక్కడ లభ్యం కావడం వర్తమాన యుగ విశేషం. ఓ మానవుడా! నీవు నీ వీలునుబట్టి ఎప్పుడో ఒకప్పుడు ఎవరికో ఒకరికి—ఎంతో కొంత అప్పు ఇచ్చే ఉంటావు. ఇది పరమ సత్యం. కనుక అప్పిచ్చువాడొక సౌకర్య సాధనమని భావించేవాడికి ఏ వూళ్లో ఉండడానికైనా వెనుకాడవలసిన ప్రమేయం లేదు.

ఋణదాతయొక్క ప్రయోజనాన్ని పొందజాలని వాడెవడైనావుంటే - వాడు ఏ నిర్జనారణ్యంలోనో ముక్కు మూసుకుని కూర్చున్న ఏకాంతరామయ్య ఒక్కడే!... కాని సన్యాసిరావు అట్టి నిర్జనారణ్య ప్రాంతైకాంతవాసికాడు. దాదాపు ఐదారువేల జనాభా కల్గిన వూళ్లో పుట్టి, పెరిగి ఆ వూళ్లోనే జీవనం చేస్తూ ఉన్నవాడు. విచిత్ర మేమిటంటే- అట్టివాడు తనకు అప్పిచ్చువా డెవడా అని ఆ ఐదారువేల మంది ముఖాలకేసి తేరి పారజూడసాగాడు.

ఆర్థికావసరాలు రాళ్ళవంటివైతే — మానవుని మస్తిష్కం నిశ్చల జలాశయంవంటిది. అటువంటి రాయి ఒకటి ఎక్కడినుండో రివ్వునవచ్చి సన్యాసిరావు మస్తిష్క తటాకంలోని నిశ్చలతను కలచివేసింది ... ఒకటి రెండు రోజుల వ్యవధిలోనే అతనికి కొంతడబ్బు కావాలి. అతని దృష్టిలో అది పెద్ద మొత్తమే. అయితేనేం ? అప్పు ఇవ్వ గలవాడు అతన్ని శంకించేందుకు ఆస్కారంలేదు. అతడు గుణశేఖరుడేకాని, ఋణశేఖరుడేమీకాదు. అయితే— సంశయము అనే భావానికి ఆశ్రయమిచ్చినది సన్యాసిరావు మనస్సే.

సన్యాసిరావు సామాన్యుడే అయినా, అతని వేతనం సామాన్యమైనదే అయినా, ఉన్నంతలో సంసారాన్ని గుట్టుగా గడుపుకుంటున్న జాగరూకుడతడు. ఒకనెల పది రూపాయలు మిగలడం, మరునెలలోనే ఏదో ఒక అవసరం అవతరించి ఆ పది రూపాయల వెన్నెలకుప్పను తుడిచిపెట్టి

పోవడం అనే రెండెత్తుగడల వెన్నెల కుప్పలాటగా ఇంత వరకూ అతని బ్రతుకు గడిచింది. అతనిజీవన తులాదండం ఋణ భారంతో వాలిపోయే ప్రమాదం అదృష్టవశాత్తూ కలుగలేదు. తత్కారణంగా మనుషులకు తాను ఋణార్థిగా మాత్రం అపరిచితుడుగా ఉండిపోయాడు.

ఇదే తనకు మొదటి అనుభవం కావడంతో ఋణ సిద్ధిని గూర్చిన ఆశా నిరాశలు అతనిలో పందెపు కోళ్లకు మల్లే ఒకదానిపై కొకటి కుప్పించ సాగాయి.

అప్పు ఎవర్ని అడగాలి?...ఇదీ ప్రశ్న.

అడుగగానే లేదనకుండా తనకు కావలసిన మొత్తాన్ని ఇచ్చేవాణ్ణి అడగాలి!...ఇది జవాబు.

ఎవడూ వాడు?...జవాబు తెలియని ప్రశ్న.

ఆనాడు పోస్టుమేన్ దర్శనం అయినప్పటినుంచీ నాటిరాత్రి నడిజామువరకు ఆలోచించగా ఆలోచించగా చిట్టచివరికి క్రాస్ వర్డ్సు పజిల్ వంటి జవాబొకటి దొరికింది. ఆ జవాబు-ముకుందం!

కృషీవలుడు ఎండిపోయిన తన పొలంలో నిలబడి మింటిలోని మొయిలుకేసి ఆశతో చూస్తాడు. ఆ వర్ష మేఘం అతని పొలంమీద వర్షిస్తే వర్షించవచ్చు; వర్షించకనే కదలిపోవచ్చు. ఏమైతేనేమి-కృషీవలునికి చేయూత నివ్వగల శక్తి దానికి ఉన్నది. ఆ జలధరం వంటివాడు

ముకుందం. వూరిలోవున్న కొద్దిమంది లక్షాధికారుల్లో అత డొకడు. వూరికి నాలుగు దిక్కుల పచ్చని పొలాల నడుమ నాలుగు పంపుసెట్లు, గుట్టక్రింద పదెకరాల మామిడితోపు, వూరిలో చిన్న చిన్న గదులతో క్రిక్కిరిసి కందిరీగల తుట్టెల్లా వున్న రెండంతస్థుల భవంతులు మూడు, బజారులో బెల్లపు మండీ, అనువైనచోట బియ్యపుమిల్లు, పిల్లనిచ్చిన మామ గారు వగైరాలన్నీ అతని పాలిటికి అల్లావుద్దీన్ మార్కు అద్భుత దీపాలు.

ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క పద్ధతిలో సాక్షాత్క రించే దుస్తులు, రెండు వ్రేళ్ళకు రెండురాళ్ళ ఉంగరాలు, బంగారు గొలుసుతో విలువైన చేతి గడియారం, నాణ్యతకు ఋమానాలనిపించే పాదరక్షలు, ఎటువంటి అందగాడి ముఖం మీదనైనా సరే నిలచి, చూపరుల దృష్టిని మున్ముందుగా తనవైపుకు ఆకర్షించుకొనగల చలువ అద్దాలు—ఇవన్నీ మకుటంలేని మహారాజువంటివాడైన ముకుందానికి వంది మాగధులవంటి సాధనాలు.

సన్యాసిరావు ముకుందాన్ని ఎన్నుకోవటానికి-అతని కలిమి ఒక్కటే కారణంకాదు. తాను అతనికి సుపరిచితుడు, బాల్యమిత్రుడు, సహాధ్యాయి. కనుక అతడు తనకు ఈ తక్షణ సహాయాన్ని చేయగలడు.

తెల్లవారింది.

తొమ్మిది గంటలకు ఇంటిగడప దాటుకో బోతుండగా వెనుకనుంచి "ఏమండోయ్ ?" అంది అతని అర్ధాంగి— దమయంతి. సన్యాసిరావు ఆగాడు.

"రేపు బుధవారం. ఎల్లుండి గురువారం. ఆ మరు నాడే శుక్రవారం" అంది ఆమె.

"సరే" అంటూ సన్యాసిరావు గడపదాటుకునేశాడు.

ముకుందం ఇంట్లో లేడు. మండీ దగ్గరికి వెళ్ళాడు సన్యాసిరావు. రూపాయల్ని ఎంచుతూ కూర్చుని ఉన్నాడు ముకుందం తండ్రి. "...నలభై అయిదు, నలభై ఆరు, నలభై ఏడు, ముకుందమా?...నలభై ఎనిమిది, నలభై తొమ్మిని, మిల్లులో ఉంటాడు, ఏభై..."

...ఆ తరువాత సన్యాసిరావు ఆలకించ లేదు. బియ్యపు మిల్లులో ముకుందాన్ని తిలకించినాడు. నిశ్శబ్దంగా కుడిచేయి పైకెత్తి పాశ్చాత్య పద్ధతిలో అభివందనమాచరించాడు. మిల్లులో ముకుందం కూర్చున్న మూలగదిలో గోడమీద మహావిష్ణువు కేలెండరు వేలాడుతోంది. శంఖము, చక్రము, గద, పద్మము మొదలైన హంగులతో అలరారుతూ ఉన్నాడు మహావిష్ణువు. తెల్లటి పైజామామీద సిల్కు లాల్చీ తొడు క్కున్న ముకుందం కూడ ఎప్పటివలెనే తన నిత్యాభరణా లను ధరించినవాడై ఉన్నాడు.

"ఏం సన్యాసీ? ఇలా వచ్చావు?" అని అడిగాడు ముకుందం బిగ్గరగా.

మిల్లు రణగొణ ధ్వనిలో తన ఋణ గుణ ధ్వని స్పష్టంగా వినబడదేమోనని భావించిన సన్యాసిరావు జంకు గొంకులతో పళ్ళికిలిస్తూ–"కొంచెం మాట్లాడాలి" అన్నాడు.

ముకుందం లేచాడు. మిల్లు బయటికి నడిచాడు. సన్యాసిరావు అనుసరించాడు. ఇద్దరూ గేటు దగ్గర ఆగారు.

"ఏం సన్యాసీ?"

మేరుపర్వతంవంటి ముకుందం ముందునిలబడిన సన్యాసిరావుకు తన అల్పత్వం బెల్జియం అద్దంలో ప్రతిబింబంలా స్పష్టంగా కనిపించింది. "మరేంలేదు ముకుందం! ఒక యాభై రూపాయలు కావాలి...మళ్ళీ ఇచ్చేస్తాను" అన్నాడు దీనాతిదీనంగా.

"ఏభై యా?... ఇప్పుడు నా దగ్గర లేదే...ఎప్పుడు కావాలి?..."

"ఒక పెళ్ళికి వెళ్ళిరావాలి ముకుందం! శుక్రవారం ఉదయం ముహూర్తం. చాల దగ్గరి చుట్టరికం కావటంచేత, తప్పనిసరిగా వెళ్ళాలి. సకుటుంబంగా గురువారం బయలుదేరాలని అనుకుంటున్నాను" అన్నాడు సన్యాసిరావు.

ముకుందం ఐదు సెకన్లు ఆలోచించాడు. "తిరిగి ఎప్పుడిస్తావు?"

మరో అయిదు సెకన్ల కాలంలో సన్యాసిరావు ఆలోచించడం, సమాధానమివ్వడం జరిగిపోయాయి. "జీతం రాగానే ఇస్తాను. ఒకటో తారీఖున మాకు జీతాలు."

"వెంకటేశం వంద రూపాయలివ్వాలి. ఈరోజు ఇస్తా నన్నాడు. తీసిపెడతాను సన్యాసీ! సాయంకాలం ఒకసారి కనిపించు" అన్నాడు ముకుందం.

సన్యాసిరావు సంధ్యాగమనంకోసం ఎదురుచూడ సాగాడు. ముకుందం తనకు డబ్బిస్తాడు, ఆ బాకీ తాను ఎప్పుడు చెల్లించాలి? ఒకటో తారీఖున!...చెల్లించగలడా తాను? చెల్లించవచ్చు. అయితే-వెనువెంటనే మరెవరినైనా వలభై రూపాయలైనా బాకీ అడగవలసిన అవసరం కూడా ఉంది. ఈ పద్ధతి ప్రతినెల చర్విత చర్వణం కావడం తథ్యం. మధ్యలో మరే ఆర్థికావసరమూ వచ్చి పడకుంటే- నాలుగైదు నెలల్లోనే ఈ ఋణభారాన్ని దింపుకోవచ్చు. అయితే—విధి నమ్మరానివాడు.

...తలలో మెదిలిన ఈ ఆలోచనలను సన్యాసిరావు బలవంతంగా బయటకు నెట్టివేశాడు. ఇప్పటి ఈ అవసరం గడిచిపోతే తరువాతి సంగతులు తరువాతనే ఆలోచించుకోవచ్చు.

సాయంకాలమైంది. కనిపించిన సన్యాసితో ముకుందం ఇలా అన్నాడు. "వెంకటేశం కనిపించలేదు సన్యాసీ! నీ అదృష్టమేమోగానీ, నా దగ్గర డబ్బులేకపోవడం ఎన్నడూ జరుగలేదు. సరే ఉదయంరా!"

నిరాశ ఆవరించిన హృదయంతో సన్యాసిరావు ఆరాత్రి గడిపాడు. తెల్లవారింది. అది బుధవారం. సన్యాసి

రావు మిల్లు దగ్గరికి వెళ్లాడు. మండీదగ్గరికి వెళ్లాడు. అతని ఇంటికే వెళ్లాడు. ముకుందం జాడ కానరాలేదు. మూడు నాలుగు పర్యాయాలు ఈవిధంగా సిటీ బస్సులా తిరిగేసరికి —ముకుందం మిల్లులోనే దొరికాడు. అతడీరోజు పంట్లాము, టెర్లిన్ స్లాక్ తొడుక్కున్నాడు.

"కాస్సేపుండు సన్యాసీ! నిన్న నువ్వు అటువెళ్లగానే వెంకటేశానికి కబురుపంపాను. ఇప్పుడు తెచ్చిఇస్తానన్నాడు. ఒరే సూరీ! వెంకటేశం దగ్గరికి వెళ్లిరా."

మిల్లులో పనిచేసే కుర్రవాడు వెంకటేశం ఇంటికి వెళ్లి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు. "సాయంత్రం ఇస్తా నన్నాడు బాబూ..."

సన్యాసిరావు మళ్లీ సాయంకాలం వెళ్లాడు. సూరి వెంకటేశం ఇంటికివెళ్లి వచ్చాడు. "ఆయనే వస్తాట్ట, నన్ను వెళ్లమన్నాడు బాబూ..." అన్నాడు.

గంట ఆరైంది. ఏడైంది. వెంకటేశం రాలేదు. అతని కోసం మళ్లీ సూరిగాణ్ణి పంపాడు ముకుందం. సూరిగాడు వెళ్లివచ్చి, "ఆయన ఇంట్లోలేదుబాబూ!" అన్నాడు. ఏడున్నరకు మళ్లీ ఒకమారు వెళ్లివచ్చి అదేవార్తతెచ్చాడు. ఎనిమిదిగంటలకు మరొకమారు వెళ్లివచ్చి, "ఉదయం ఎని మిది గంటలకల్లా తప్పకుండా వచ్చి ఇస్తాట్ట!" అన్నాడు.

"డామిట్!" అన్నాడు ముకుందం.

వెంకటేశం 'డామిట్' కావడానికి తాను కారకు డౌతున్నాడేమోనని మథనపడ్డాడు సన్యాసిరావు.

గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఆశా లేశంతో ఇల్లు దగ్గరికి వెళ్లాడు. ముకుందం మల్లుధోవతి కట్టుకున్నాడు. పొడుగు చేతులు చొక్కా తొడుక్కున్నాడు. మీద కండువా వేసుకున్నాడు. సన్యాసిని చూచి కూర్చో మన్నాడు. అతని గాంభీర్యాన్ని చూచి సన్యాసి పలికే ధైర్యాన్ని కూడా కోల్పోయి మౌనంగా కూర్చున్నాడు.

"ఒరే సూరి! వెంకటేశం దగ్గరికి వెళ్ళిరా!"

సూరిగాడు వెళ్లివచ్చేడు. "మధ్యాహ్నం వచ్చి ఇస్తా నన్నాడు బాబూ!"

"ఒకసారి ఇలా రమ్మన్నానని చెప్పు" అన్నాడు ముకుందం. "నువ్వు ఎప్పుడు వెళ్ళాలి సన్యాసీ!"

"రాత్రి ఎనిమిది గంటలకు చివరి రైలు" అన్నాడు సన్యాసి.

సూరిగాడు తిరిగివచ్చాడు. "ఎవరో డబ్బిస్తానన్నా రట—బాబూ! తీసుకుని అయిదు నిమిషాల్లో వచ్చేస్తా నన్నాడు."

"వెంటనే రమ్మంటున్నానని చెప్పి పిలుచుకురా! వెళ్లు? ఇంట్లో లేకుంటే—ఎక్కడున్నాడో వెతికి వెంట బెట్టుకు నిరా!" అంటూ గద్దించాడు ముకుందం.

మరో అరగంటకు మృగరాజు చెంతకు తరలివచ్చే అల్పజంతువులా అల్లంత దూరంలో వెంకటేశం కనిపించాడు. వెనకనే సూరిగాడున్నాడు.

ముకుందం వీధిలోకివచ్చి నిలబడ్డాడు. వెంకటేశం సమీపించాడు. ఇంకా పదడుగుల దూరం ఉండగానే ప్రార్థనా పూర్వకమైన స్వరంతో "డబ్బు సమకూరలేదు ముకుందం! ఏ బాధలైనాపడి నీ డబ్బు నీకు..." వెంకటేశం మాటలు అంతటితో ఆగిపోయింది. ముకుందం కండువా వెంకటేశం మెడమీదికి విసిరి, ఎడమ చేతితో గట్టిగా లాగి పట్టుకున్నాడు. "ఆ మాటలన్నీ తరువాత. ముందు డబ్బు అక్కడ పెట్టు."

అవాంఛనీయమైన ఈ సన్నివేశాన్ని గూర్చి ఎక్కువగా చెప్పడం తగదు. గారడీవాడిచుట్టూ మూగినట్లున్న జనం నడుమ వినోద వస్తువులా నిలబడిన వెంకటేశం అవమానాతిశయంతో కంట తడిపెట్టుకున్నాడు. "తలైనా తాకట్టు పెట్టి మధ్యాహ్నానికల్లా ని డబ్బు నీకు చెల్లించుకుంటాను"

సంజాయిషీ చెప్పుకుని, జీవన్మృతుడిలా అక్కడినుంచి సాగిపోయాడు.

నిశ్చేష్టుడై నిలబడిపోయిన సన్యాసిరావుతో–"నువ్వు సాయంకాలంవచ్చి డబ్బు తీసుకుని వెళ్లుసన్యాసీ!" అన్నాడు ముకుందం.

సాయంకాలం ఆఫీసునుండి బయటపడిన సన్యాసిరావు ముకుందం వద్దకు వెళ్లడానికి మారుగా వూరిబయటికి షికారు వెళ్లాడు. అతని మనస్సును ఏదో మూగబాధ ఆవరించుకొన్నది. పాపం వెంకటేశం! ముకుందానికి బాల్యమిత్రుడు! అతని డెస్కుమేటు! అతని నోట్సులన్నీ ఎప్పటికప్పుడు రాసి పెట్టినవాడు! ఈ యోగ్యతలేవీ కూడ ఈనాడు జరిగిన భంగపాటునుండి అతన్ని తప్పించలేకపోయాయి.

సన్యాసిరావు ఇల్లు చేరుకునేసరికి గంట ఏడైంది. అప్పటికే ముస్తాబై సిద్ధంగావున్న దమయంతి అతన్ని చూచి చిటపటలాడింది. "రక్షించారు. తీరా పరిగెత్తే రైల్లోకే ఉరకమంటారేమోననుకున్నాను. ఇప్పటికైనా వచ్చారు. నయమే!...మీకోసం గంటక్రితం ఎవడో కుర్రాడు వచ్చి పోయాడు..."

"ఎవరు?" అన్నాడు సన్యాసిరావు.

"ఎవరో ముకుందంగారట. మీరు డబ్బు అడిగారటగా? రమ్మన్నాట్ట!..."

సన్యాసిరావు విన్నాడు. కాళ్లు చేతులు కడుక్కున్నాడు. "అన్నం వడ్డించు" అన్నాడు.

ఆమె అన్నం వడ్డించి, "వెళ్ళి వచ్చారా?" అని అడిగింది.

"లేదు.'!

సన్యాసిరావు భోజనం చేశాడు. "వెళ్ళి త్వరగా రండి మరి. రైలుకు వేళైంది" అంది దమయంతి.

సన్యాసిరావు విధిలేక బయలుదేరాడు.

తెల్లవారుఝామున పెండ్లిముహూర్తం. తానూ, తన భార్య తప్పనిసరిగా వెళ్ళవలసిన పెండ్లి అది. వెళ్ళ కలిగిఉంటే కలిగే తృప్తికంటే—ఈవాడు వెంకటేశానికి కలిగిన ఘోరవిపత్తు తనకు కలుగబోదు అన్న సంతృప్తి ఎన్నోవేలరెట్లు హెచ్చుగా కనిపించిం దతనికి.

ఒకగంటసేపు పురవీధుల్లో యథేచ్ఛగా సంచరించిన పిమ్మట సన్యాసిరావు గృహోన్ముఖుడయ్యాడు. రైలు ఈపాటికి వెళ్ళిపోయి ఉంటుంది. తాను తన భార్యతో ఇప్పుడొక అబద్ధం చెప్పబోతున్నాడు. ఫరవాలేదు. ప్రాణంకంటే మానం గొప్పది. మానరక్షణార్థం అబద్ధమాడడంలో తప్పు లేదు.

అతడొకటి తలచితే—దైవం మరొకటి తలచాడు. ఇంటికి సమీపించిన సన్యాసిరావు కనులకు గోచరించిన దృశ్యం ఎట్టిది?...ఇంటిముందర ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు ఒక కూలివాడు నిలబడి ఉన్నాడు. ఇంటి అరుగుమీద పరుపుచుట్ట, ట్రంకు, మరచెంబు వగైరాలు విడసి ఉన్నాయి. ప్రక్కనే ఆతురత, విసుగు, కోపము నిండిన ముఖంతో దమయంతి నిలబడి ఉంది. ఇల్లు తాళం వేయబడి ఉంది.

స్విచ్ నొక్కగానే బల్బు వెలిగినట్లు—సన్యాసిరావు రాగానే కూలివాడు సామానులంతా నెత్తిమీదికి ఎత్తుకునేశాడు.

"ఇదేమిటీ? ఎక్కడికి?...ముకుందా కనిపించ లేదు..." అంటూ సన్యాసిరావు వారించబోయాడు.

దమయంతి చిచ్చుబుడ్డిలా బుస్సుమంది. "చాల్లెండి ఇక! ఎందుకు కనిపిస్తాడు మీకు? అసలు ఈ పెళ్లికి వెళ్లాల నుంటేగా మీకు?...ఆ ముకుందంగారే డబ్బు పంపించారు. ఇకనైన స్టేషనుకు నడవండి..."

సన్యాసిరావు ఆశ్చర్యంతో భ్రమాన్నపడిపోయాడు. ఇక తాను ఫోటమినుండి తప్పించుకోడానికి ఒక్క అవకాశం మాత్రం మిగిలి వుంది. "అయితే—ఇప్పుడు రైలేదీ?..."

"ఈపూట రైలు రెండుగంటలు ఆలస్యంగాబూ!" అన్నాడు కూలివాడు. సన్యాసిరావు హతాశతో నిరుత్తరుడై పోయాడు. చివరిక్షణంలో తప్పించుకో గలిగాననుకొన్న ముప్పు మళ్లీ వచ్చి తలుపు తట్టింది. జరుగవలసినది జరిగియే తీరునని తెలిసికొనుటతప్ప తాను ఇక చేయగలిగిందేమీ లేదు. సంకల్పశూన్యుడైన సన్యాసిరావు కూలివాడి నెత్తిమీది ట్రంకు పెట్టెలా స్టేషనువైపు సాగాడు.

* * *

"అప్పిచ్చువాడు...చొప్పడకున్నట్టి వూరు చొరకుము..." అన్నాడు సుమతీ శతకకారుడు. మీ ఎరుకలో అటువంటి వూరేదైనా ఉంటే సన్యాసిరావుకు తెలియజేయవలసినది. సుమతీశతకకారుని మాటలు పెడచెవిని పెట్టడానికి సన్యాసిరావు సంసిద్ధుడుగా ఉన్నాడు.

★★